


ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 7 సంచిక : 11 పుష్యం : 28-30 20-02-2002

**RAMANA BHASKARA**
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 16

VOL : 7 ISSUE : 11

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278

## ధ్యానము - ప్రత్యక్షానుభూతి

మనము అనుభవంలోనికి తెచ్చుకోవలసిన వస్తువు (ఆత్మ) మన స్వరూపంగా, మనలో అంతర్యామిగానే ఉంది. మనలో ప్రతి ఒక్కరం గాఢనిద్రలో ఆత్మలోనే మునిగి వస్తున్నాం. మనలో ప్రత్యక్షంగా, స్వరూపంగా ఉన్న ఆత్మ పైనే మనస్సును గురి పెట్టమంటారు శ్రీరమణులు. శ్రీరమణులు తరచు మన ప్రత్యక్ష నిద్రానుభూతిని గుర్తు చేస్తూ ఉంటారు. సృష్టిలో ప్రతి ఒక్కరికి గాఢనిద్రానుభూతి సమానమే. గాఢనిద్రలో మనమందరము ఒకేచోట ఉంటున్నాము. ఒకరు ధనికుడైనా, ఒకరు పేద అయినా, వాడు ఏ మతస్థుడైనా గాఢనిద్రలో ఒకే రకమైన సుఖానుభూతిని పొందుతున్నారు. ఎవరివద్దకైనా వెళ్ళి నేను ఎలాగ నిద్రలోనికి వెళ్ళాలి? అని ప్రశ్నిస్తామా? లేదు. గాఢనిద్ర ఎలాగైతే మన ప్రత్యక్షానుభవమో, అట్లే ధ్యానస్థితి. గాఢ నిద్రలోనికి జారుటకు మనము పూజ, జపము మున్నగునవి ఆచరిస్తామా? లేదు. సహజంగానే నిద్రలోకి జారుతాం, అలాగే ధ్యానమూ సహజంగా రావాలి. ధానస్థితి అనగా నిరహంకార స్థితి. ధ్యానస్థితి అనగా తలంపులకు మూలమైన మూలతలంపు దానిమూలంలో ఉనికినికోల్పోవడం. సత్యాన్ని మరుగుపరచడంలో ఆటంకంగా ఉన్న మూలతలంపును తీసెయ్యడమే ధ్యానం. మనసహజస్థితిలో సంస్థితమవడమే ధ్యానం. మనకు మనం హద్దులు ఏర్పరచుకొని పూజగదికే పరిమితమవడం ధ్యానంకాదు. అవగాహనతోకూడిన ఆనందమయ, శాంతిమయ, ప్రేమమయ జీవితము గడుపుటకు ఎరుకతో కూడిన ధ్యానము తప్పనిసరి. ధ్యానము కాలమునకు అతీతమైనది. అది జీవనదీ ప్రవాహములాంటిది. ఒకనది మహాసముద్రములో కలిసి తన ఉనికిని కోల్పోయినట్లు ధానించు మనస్సు, తన ఉనికిని కోల్పోయి శాశ్వతమైన తనమూలమైన ఆత్మలో లీనమౌతుంది. కావున ధ్యానము జీవితంలో భాగము కావాలి. ధ్యానము వేరు లౌకిక జీవితము వేరుకాదు.

**చావలి సూర్యనారాయణమూర్తి**
టీచరు, **అమలాపురం**

**ఈ సంచికలో...... సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు**

11-01-2002 కొమరగిరి పట్నం ........ 3
21-01-2002 మలికిపురం ........ 8
31-01-2002 నరసాపురం ........ 12

Visit us: www.srinannagaru.com

### రమణ భాస్కర పాఠకులకు మనవి !

దేశ, విదేశాలలో ఉన్న భక్తుల సౌకర్యార్థం సద్గురు శ్రీ నాన్నగారి పేరుమీద వెబ్‌సైట్ రిజిష్టర్ చేయబడినది. కావున భక్తులు ఈ వెబ్‌సైట్ ద్వారా శ్రీనాన్న గారి ప్రవచనములు మరియు ప్రోగ్రామ్‌ని తిలకించగలరు.

వెబ్‌సైట్ అడ్రస్సు: www.srinannagaru.com

# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, ది. 11-01-02, కొమరగిరిపట్నం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

దేహం ఈభూమిమీదకు ఏపనిచేయటానికివచ్చిందో ఆపనిదేహంద్వారా నెమ్మదిగా జరుగుతూఉంటుంది, ఆపనిఅయినతరువాత దేహంచనిపోతుంది. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టేయండిఅన్నారు భగవాన్. దేహంద్వారా ఏదిజరగాలో అదిజరుగుతూఉంటుంది, దేహంద్వారాజరిగే ఆపనితో మీరు తాదాప్యంపొందకండి. దేహప్రారబ్దమునుబట్టి దానిని విమర్శించేవారు విమర్శిస్తారు, పొగిడేవారు పొగుడుతారు. ఆ నింద, స్తుతులను కౌగలించుకోవద్దు. నింద, స్తుతులను కౌగలించుకొంటే అహంభావన పెరిగిపోతూఉంటుంది, దేహాభిమానం పెరిగిపోతూఉంటుంది. నింద, స్తుతులు వచ్చినప్పడు మీబ్రెయిన్‌ను బేలెన్స్‌చేసుకోవాలి అంతేగాని దీనిని గాలికివదిలేసి నేను ఏదోగంటసేపు పూజచేస్తున్నాను అంటే కుదరదు. భౌతికంవేరు, ఆధ్యాత్మికంవేరు కాదు. మనం ట్రయినింగ్‌అవ్వటానికి ఈభూమిమీదకు వచ్చాము. ఇది ఒక ట్రెయినింగ్ గ్రౌండ్. ఆధ్యాత్మికంవేరు, భౌతికంవేరు అనుకొంటే మనం జీవితంలో సక్సెస్ అవ్వలేము. మనకు స్థూలశరీరంతెలుస్తోంది, సూక్షశరీరంఅంటే మనస్సు అందులోకోరికలు, ఇష్టాలు, అయిష్టాలు ఉన్నాయి, అవి నీకు తెలుస్తున్నాయి. ఇంక మనకు తెలియని శరీరంఒకటిఉంది. అది కారణశరీరంఅంటే అజ్ఞానం. రాబోయే జన్మకు హేతువులుఅన్నీ అందులో ఉన్నాయి. అందులో ఎంత స్టోర్‌ఉందో మనకు తెలియదు. దానిని తగ్గించుకోవటానికి దైనందిన జీవితంలో కర్మశౌచం చాలాముఖ్యం. కర్మశౌచంఅంటే ఏపనిచేయటంవలన మనకు నిర్మలత్వంవస్తుందో, పని ఎలాచేయటంవలన మనం ఉద్దరించబడతామో, మన అంత:కరణం శుద్దిఅవుతుందో అలా పనిచేస్తూ జీవించాలి. నీకు అన్నం లేకపోతే ఎవరైనా అన్నంపెడతారు, బట్టలులేకపోతే బట్టలుఇస్తారు, కాని నీమనస్సును ఎవరు బాగుచేస్తారు? నీమనస్సును ఉపయోగించుకొని దానిని నీవే బాగుచేసుకోవాలి. మనస్సులోమంచి, చెడు ఉండవచ్చు. మంచిమనస్సును ఆశ్రయించి, ఆరోజుకారోజు చెడును తగ్గించుకొంటూ రావాలి. కర్మశౌచం ఉండాలన్నా, వాక్‌శౌచం ఉండాలన్నా ఈశ్వరానుగ్రహంఉండాలి. మంచిగుణాలను ఆశ్రయించి చెడుగుణాలను తొలగించుకో. స్వస్థితిని పొందండిఅని భగవాన్ చెపుతున్నారు. స్వఅంటే ఆత్మ, చైతన్యం. స్వస్థితిఅంటే ఆత్మస్థితిని పొందండి. ఉన్నదేఅది. అది తప్పించి ఏదీలేదు. అది తప్పించి మీకుఏదైనా కనిపిస్తూఉంటే అవి ఉండటంవలన కనబడటంకాదు, నీమనస్సుకు అలా కనిపిస్తోంది. నీకు తాడు పాముగాకనిపిస్తోందిఅనుకో నీకు భయంకలుగుతుంది, వణుకువస్తుంది అన్నీవచ్చేస్తాయి.





తాడులోనుండి నీకు భయంరావటంలేదు, తాడునుపాముగా నీమనస్సుచూస్తోంది అక్కడనుండి భయం ప్రారంభమవుతోంది. చూసేది, కంగారుపడేది మనస్సే. వీటిఅన్నింటికి నీమనస్సే కారణం. ఉన్నవస్తువుఉన్నట్లుగాకాకుండా వేరుగానీకు కనబడుతూఉంటే దానికి నీమనస్సే కారణం. అందువలన అదినశించేవరకు నీవుప్రయత్నంచెయ్యి. జ్ఞానాన్ని సంపాదించు. జ్ఞానంపట్ల నీకుఎంతప్రేమఉందో, ఎంతఇష్టంఉందో దానిని పొందటంకోసం నీవు చేసే ప్రయత్నంకూడా అంతప్రేమగా, అంతఇష్టంగాచేయాలి, అప్పడు సక్సెస్‌అవుతావు. అంతేగాని నీవు విసుగుగా ప్రయత్నంచేస్తే సక్సెస్ అవ్వలేవు. లోపల పరమేశ్వరుడు ఉన్నాడు. వాడు నీమాటకు అందడు, నీమనస్సుకు అందడు. వాడు అనుభవైకవేద్యం నీఅనుభవానికి అందుతాడు. వాడు అనుభవంలోనికి రాకుండా ఏ విషయాలుఅయితే అడ్డువస్తున్నాయో వాటిని ఇదికాదు, ఇదికాదుఅని వాటిని తొలగించుకొంటూవెళ్ళాలి, అదేసాధన. మనస్సును వ్యక్తం అవ్వనివ్వకు. మనస్సు వ్యక్తమవుతోందా నీకు తిరోగతేగాని పురోగతిలేదు. మనం ఉమ్మివేసినప్పడు మనశరీరంమీద వేసుకోము, కాండ్రించి దూరంగా వేస్తాము. అలాగే మీలోఏవైనా చెడుఅలవాట్లుఉంటే, కోపంఉంటే, అసూయఉంటే వాటిని దూరంగా విడిచిపెట్టండి. ఉమ్మి నీదేఅలాఅని నీవంటిమీద వేసుకోవు, దూరంగావేస్తావు. అలాగే నీకోపతాపాలను, బలహీనతలను దూరంగా విడిచిపెట్టు. వాటిని విడిచిపెట్టటానికి నీవు చేసేప్రయత్నమే సాధన. పిల్లలలో ఎక్కువగా అనుకరణ ఉంటుంది. పిల్లలదగ్గర మాట్లాడేటప్పడు చాలా జాగ్రత్తగా మాట్లాడాలి, స్వచ్ఛంగామాట్లాడాలి, బాషసరళంగాఉండాలి, భావంబాగుండాలి. ఎవరో ఉద్రేకపడుతున్నారుఅని నీవుకూడా ఉద్రేకపడకు. నీవు ఏదిచేసినా అది నీకు ఈశ్వరానుగ్రహాన్ని సంపాదించిపెట్టాలి. నీవు రోజూ శరీరానికి స్నానంచేస్తున్నావు. మరి నీమనస్సుకు స్నానంచేయించవా. నీవు మంచిపనులుచేస్తూఉంటే, మంచిమాటలు మాట్లాడుతూఉంటే అది నీమనస్సుకు స్నానంచేయించినట్లు అవుతుంది. గాఢనిద్రలోనీవు ఏస్థితిలో ఉంటున్నావో దానిని జాగ్రదవస్థలో ప్రాక్టీసుచెయ్యి. దానిని జాగ్రత్‌సుషిప్తి అంటారు. గాఢనిద్రలో మనకు బయటగొడవలు ఏమీలేవు. కాని అక్కడమనం సుఖంగా, ఆనందంగాఉన్నాము కారణం అక్కడ మనం పరమాత్మను కౌగలించుకొనిఉన్నాము. సుఖానికి, ఆనందానికి శరీరమేకేంద్రంఅని అనుకొంటున్నాము. అది ఏదోరోజు మనలను విడిచిపెట్టిపోతుంది మనఅహంకారమే మనవిరోధిఅని మన బుర్ర ఎంతవరకు గ్రహిస్తోంది. శరీరంనుండే శాంతివస్తూఉంటే గాఢనిద్రలోశరీరంతో సంబంధంలేకుండా నీకు శాంతిఎలాకలుగుతోంది? గాఢనిద్రలో మన ఆస్తిగురించిగాని, మనపదవిగురించిగాని, మనదేహంగురించిగాని ఏగొడవలేదు అలాగని అక్కడ మనం సుఖంలేకుండా, శాంతిలేకుండా

ఉన్నామా? లేదు. అక్కడ మనం సుఖంగా, శాంతిగా ఉన్నాము. ఎందుచేతనంటే అక్కడ మనం పరమాత్మ కౌగిలిలోఉన్నాము. కుటుంబంలో మీపనులు శ్రద్ధగాచేసుకోండి. కుటుంబసభ్యులనుకూడా ఈశ్వరుడిగానే భావించి ప్రేమించండి. వారు మీపట్ల అగౌరవంగాఉన్నా మీరుమాత్రం గౌరవంగానేచూడండి. కాని మీ మనస్సును నారాయణుడికి తప్పించి ఎవరికిఇవ్వవద్దు. ఎవరికిఇచ్చినా మీజీవితంలో దుఃఖంతప్పదు.

హృదయంలోఉన్న భగవంతుడిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి మీదేహం మీకుసహకరించాలి, మీఇంద్రియాలు మీకుసహకరించాలి, మీమనస్సు మీకుసహకరించాలి. ఆహారం విషయంలో, మాటలవిషయంలో, చేసేస్నేహాలవిషయంలో, చదివేపుస్తకాలవిషయంలో బహుజాగ్రత్తగాఉండండి. ఏదో ఉదయంపూజచేస్తున్నాము, భక్తిగాఉంటున్నాముఅంటే సరిపోదు. మిమ్మల్ని ఎవరైనా అగౌరవంగామాట్లాడినా వారితో మీరు గౌరవంగా మాట్లాడుతున్నారుఅనుకోండి అప్పుడు ఈశ్వరుడు ఏమిచేస్తాడుఅంటే వాడు అగౌరవంగా మాట్లాడినప్పుడు వీడుకూడా అగౌరవంగామాట్లాడాలికదా అది జీవుడిలక్షణంకదా మరి వీడు ఏమిటి గౌరవంగా మాట్లాడుతున్నాడు, వీడిలో జీవలక్షణాలు కనబడటంలేదు ఏమిటి అని సడన్‌గా ఆయన దయను వాడికిఇస్తాడు, స్వస్థితినిఇస్తాడు. అంతేగాని ఏదోకోలాటాలవలన ఇదివచ్చేదికాదు. ఉన్నది ఆత్మే. లోకంలేదు, లోకంలోఏదోఉందని ఆర్భాటాలు చేస్తున్నాము. గొప్పలకోసం పనులుచేస్తే శరీరం స్మశానానికి వెళ్ళినప్పుడు పదిమంది ఎక్కువవస్తారుకాని మరణానంతరజీవితం సున్నా. నీవు హీరోవికాదు, నీవుజీరోవి వెనుకకువెళ్ళికూర్చో అంటాడు భగవంతుడు. మీకు అశాంతికి కారణముఉన్నప్పటికి ఆకారణాన్ని కౌగలించుకోవద్దు. కౌగిలించుకొంటే అక్కడే ఉంటుంది, కౌగిలించుకోకుండా వదిలేస్తే అదేపోతుంది. మీరు పూజలుచేయండి, జపాలుచేయండి, ధ్యానాలుచేయండి, భజనలుచేయండి. ఏమిచేసినా దేహబుద్ధిలోనుండి విడుదలపొందండి. సాధనపేరుమీద అజ్ఞానమునుండి బయటకు రావాలిగాని దానిని అలంకరించుకోవద్దు. మానవుడికి మానవుడికిఉన్న సంబంధం స్వార్థంమీద ఆధారపడిఉంటుంది. కాని జ్ఞాని ప్రేమఅలాంటిదికాదు. అది నిజమైనప్రేమ, దానికి హద్దులులేవు. మనస్సుకు హద్దులు ఉన్నాయి, కాని ఆత్మకుహద్దులులేవు. నీలోప్రేమఉంటే ప్రపంచంఅంతా ప్రేమమయమే. నీలోజ్ఞానంఉంటే ప్రపంచంఅంతా జ్ఞానమయమే. లోపలఉన్న ఈశ్వరుడిని అనుభవంలోనికి తెచ్చుకొంటే అంతా ఈశ్వరమయమే. అప్పుడు భౌతికమే అసలుకనబడదు. స్వార్థంలేకుండా ప్రేమించటంభక్తి. నీవు ప్రేమయొక్క శిఖరానికి వెళ్ళగలిగితే భక్తియొక్క శిఖరానికి వెళ్ళగలిగితే అక్కడఉన్నది నివృత్తే, అక్కడఉన్నదిశాంతే, అక్కడఉన్నదిమోక్షమే. మాకు ఈమధ్య పరిస్థితులు బాగాలేదుఅంటారు. అదికూడా భగవంతునిఅనుగ్రహమే. అందులోనుండి





తెలివితేటలుపెరుగుతాయి, ఆలోచనపెరుగుతుంది. దారిద్ర్యంలోకూడా ఈశ్వరానుగ్రహంఉంది. కొన్ని పాఠాలు నేర్పటానికే నిన్నుఅక్కడ ఉంచాడు. అజీర్తితోబాధపడేవాడికంటే, ఆకలితోబాధపడేవాడికి ఎలాజీవించాలిఅని జీవితంలో ఒకపోరాటంవస్తుంది, క్రమశిక్షణనేర్చుకొంటాడు. మనం గుడికిఎందుకువెళతాముఅంటే భగవంతునికోసంవెళ్ళము, కోరికలకోసంవెళతాము. భగవంతునితో వ్యాపారంవద్దు. భగవంతునిమీద కారణంలేనిభక్తిఉంటే ఆయనస్వరూపాన్ని మీకుఇస్తాడు. అడిగినవారికి అడిగినదేఇస్తాడు, అడగనివారికి అన్నీఇస్తాడు, ఆయనస్వరూపాన్నికూడా ఇస్తాడు వాడు నారాయణుడు. ఏమీకారణంలేకుండా మాఅత్తగారు తిడుతోందిఅని కొంతమంది కోడళ్ళు చెపుతూఉంటారు. అలా తిట్టటానికే భగవంతుడు మీఅత్తగారిని అక్కడపెట్టాడు. అది మీకుతెలిస్తే దుఃఖం వెంటనే అణిగిపోతుంది. సబ్జక్టు అర్థంచేసుకోండి. మీఅత్తగారిని ఏపనికోసం అక్కడపెట్టాడో ఆవిడద్వారా ఆపనిజరిగిపోతూఉంటుంది, నీవుకంగారుపడవద్దు, మాఅత్తగారు తిడుతోందిఅని ఈశ్వరుడికి తెలియదా? ఈశ్వరుడికి తెలియకుండా ఈసృష్టిలో ఏదీజరగటంలేదు. అన్నీ ఆయన సంకల్పంప్రకారం జరుగుతాయి. అది నీకు తెలిసేవరకు నీవుసాధనచేయవలసిందే. ఉన్నదిఈశ్వరుడే. ఆయనతప్పించి నీమనస్సుకు ఏదైనా కనబడుతూఉంటే అందులోనుండి విడుదలపొందేవరకు సాధనచెయ్యి. మనకు కళ్ళుతెరిస్తే విషయాలు కనబడుతున్నాయి. కళ్ళుమూస్తే కోరికలు, తలంపులు కనబడుతున్నాయి. జ్ఞానికిఅలాకాదు కళ్ళుమూసినాఆనందమే, కళ్ళుతెరిచినాఆనందమే. శరీరం ఆనందంతో ఊగిసలాడుతూఉంటుంది. మీకు తపనముఖ్యం. డబ్బుఅంటేఇష్టంఉన్నవాడికి డబ్బుసంపాదనపట్ల ఎంతతపనఉంటుందో, అధికారంఅంటే ఇష్టంఉన్నవాడికి అధికారంపట్ల ఎంతతపన ఉంటుందో ఆమాత్రంతపన నీకు భగవంతునిమీద ఉంటే నీకు సాక్షాత్కారంకలుగుతుంది. నీకు అర్హతకలిగిందిఅనుకో, మనస్సుకు నిగ్రహంవచ్చిందిఅనుకో నీవు మోక్షాన్నిమర్చిపోయినా, ఆయనమర్చిపోడు, నీకుమోక్షాన్నిఇచ్చేస్తాడు.

మనకుతెలిసినా తెలియకపోయినా ఈసృష్టిఅంతా ఈశ్వరసంకల్పంతోనే నడుస్తోంది. అంతా ఈశ్వరసంకల్పంతోనేజరుగుతోందిఅనితెలిస్తే సుఖం, తెలియకపోతే దుఃఖం అంతా ఈశ్వరసంకల్పంతోనేజరుగుతోందిఅని మనం నోటితో చెప్పేమాట అనుభవంలోనికి తెచ్చుకొంటే అది జ్ఞానం. లోపల బ్రహ్మం ఉంది. బ్రహ్మంఉంది అనిఅనుకొంటే సరిపోదు, భావిస్తేసరిపోదు దానిని అనుభవంలోనికితెచ్చుకోవాలి. అనుకోవటాలు, భావించటాలువద్దు. దానిని అనుభవంలోనికి తెచ్చుకో. నీవు ఎవరిగాఉన్నావో అదితెలుసుకోవటమే ప్రత్యక్షజ్ఞానం. ప్రపంచంలో అనేక విషయాలు నేర్చుకొంటున్నాము. అది ప్రత్యక్షజ్ఞానంకాదు. నీమనస్సుతో

గ్రహించేదిఅంతా పరోక్షజ్ఞానం. ఒక్కఆత్మజ్ఞానంమాత్రమే ప్రత్యక్షజ్ఞానం. నాకురూపంఅంటే ఇష్టం, రూపధ్యానంచేసుకొంటున్నానుఅంటే చేసుకో, మంచిదే. నీమార్గంలో నీవువెళ్ళిపో. నీమార్గంకూడా గమ్యానికి తీసుకొనిపోతుందిఅన్నారు. నీవు నామంచేస్తున్నావుఅనుకో, నామంఎప్పటివరకుచేయాలిఅంటే నామంచేసేమనస్సు కరిగిపోయేవరకు నామంచెయ్యి. నీవుమంత్రంచేస్తున్నావుఅనుకో. ఏదేవునిమంత్రంఅయితే చేస్తున్నావో ఆదేవునితో మనస్సు తాదాప్యం చెందుతుంది. అలా తాదాప్యంచెంది మనస్సు కరిగిపోతుంది, అప్పుడు దేవుడు నీకువ్యక్తమవుతాడు, అదేజ్ఞానం. నీకు కోరికలులేకపోతే లక్షమందిమధ్య కూర్చొన్నా నీవు ఏకాంతవాసంలోఉన్నట్లే అన్నారు భగవాన్. నీకుకోరికలు ఉంటే గదిలో తలుపులువేసుకొని ఒంటరిగాకూర్చున్నా నీవు ఏకాంతవాసంలో ఉండవు, నీవు అడవిలోనేఉంటావు. అజ్ఞానికి లోపల, బయటగాని జ్ఞానికి లోపలలేదు, బయటలేదు. ఒకసారి సనతకుమారుడిని నీకు ఏమికావాలిఅని శివుడుఅడిగాడు. నాకు ఏమికావాలిఅని నీవుఅడగటంఏమిటి? నీకు ఏమికావాలోచెప్ప నేనుఇస్తానుఅన్నాడు. అదిజ్ఞానిస్థితి, అది జ్ఞానియొక్క వైభవం.

జపంచేయగాచేయగా, విచారణచేయగాచేయగా నీవుపోతావుఅని అనుకోకు, నీవుఎవరోనీకు తెలుస్తుంది. అదేచైతన్యం, అదేఆనందం. దానికి దేహంఉండటంతో సంబంధంలేదు. ఇప్పుడు ఇక్కడకూర్చొన్నాము. మనకు ఏదోవిషయం జ్ఞాపకంవస్తుంది. ఆ విషయంతో మనస్సుకలుస్తుంది. అప్పుడు దుఃఖం ప్రారంభమవుతుంది. అదిసంయోగం. మనకు దుఃఖంతో సంయోగంవస్తోంది. అక్కడఆగిపోవద్దు. అందులోనుండి బయటకురా అదివియోగం. నీకు దుఃఖంతో సంయోగంవచ్చింది. అక్కడఆగిపోవద్దు. నేనుక్రింద పడిపోయానుఅని భయపడవద్దు ధైర్యంగాఉండు. వియోగంకోసం ప్రయత్నంచెయ్యి. ఏకారణంవలన నీకుదుఃఖంవచ్చిందో దానిని తెంపేసుకో. అప్పుడు దుఃఖంతో వియోగంవచ్చేస్తుంది. అప్పుడు దుఃఖంనుండి విడుదలపొందుతావు. శరీరంచనిపోయినప్పుడు మిూస్నేహితులతో, బంధువులతో సంబంధం తెగిపోతుందిగాని గురువుతో సంబంధంతెగదు, గురువు నీకూడనేఉంటాడు. చనిపోయినతరువాత ఎక్కడికోవెళ్ళిపోతాము అక్కడకూడా గురువు ఉంటాడాఅని కొంతమందిఅడుగుతున్నారు. మిమ్మల్ని రిసీవ్‌చేసుకోవటానికి మీకంటే ముందుగావెళ్ళి అక్కడ కూర్చొంటాడు, మిమ్మల్ని చేయిపట్టుకొని హృదయగుహలోనికి తీసుకొనివెళతాడు వాడుగురువు. నీవునావడవు, నన్ను పొందకుండా నీవుఎక్కడికివెళ్ళినా నీకుఅశాంతే. నీవునావాడవుకాబట్టి నన్ను పొందేవరకూ నీకు శాంతిలేదుఅని భగవంతుడు చెపుతున్నాడు. నీమాట, చేత, ఆలోచన భగవదనుగ్రహంపొందటానికి నీకుసహకరించాలి. ఆవిధంగా జీవించటానికి నీవుప్రయత్నంచెయ్యి.

20-02-2002

2A

# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, ది. 21-01-02, మల్కిపురం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనోనిగ్రహానికి చాలా ఉపాయాలు ఉన్నాయి. కాని ఈశ్వరుడిపట్ల పరిపూర్ణమైన విశ్వాసంఉన్నవాడికి మిగతా ప్రక్రియలతో సంబంధంలేకుండా మనస్సుఅణుగుతుంది. భగవంతునిపట్ల పరిపూర్ణమైన విశ్వాసంవలన మనోనిగ్రహంవస్తుంది, మోక్షంకలుగుతుంది. రూపాలువేరైనా, రంగులువేరైనా, గుణాలువేరైనా అందరిలోను అంతర్యామిగాఉన్నవాడినినేనే. అందువలన నీవు ఆరూపాలు, నామాలు, గుణాలు చూడవద్దు. అందరిలో అంతర్యామిగాఉన్ననన్నేచూడు. అప్పుడు నీకు నిజమైనచూపు కలుగుతుంది, అప్పుడు నిజం నీకుతెలుస్తుంది. నీబుద్ధిలో చిన్నదోషంఉన్నా నీవు అమృతత్వంను పొందలేవు. అందువలన నీవు సమానబుద్ధిని ప్రాక్టీసుచెయ్యి. ఎప్పుడైతే నీకు సమానబుద్ధి కలిగిందో అప్పుడు నీకు అమృతత్వం కలుగుతుంది. ఈశ్వరభావన విడిచిపెట్టవద్దు. వ్యర్థమైన చింతలతో, వ్యర్థమైనకర్మలతో నీకాలాన్ని పాడుచేసుకోవద్దు. నీవు ఏపనిచేసిన నిర్మలంగా, నిశ్చలంగా, ప్రేమగాచెయ్యి. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడుఅనే విశ్వాసం నీకు నిజంగాఉంటే నీమనస్సు పవిత్రమై, ఆత్మాకారంచెందుతుంది. ఒక్కనీప్రయత్నం వలననే ఈ ప్రకృతిగుణాలనుండి బయటకురాలేవు, భగవంతుని దయఅవసరం. భగవంతుని సహాయంలేకుండా మాయను అతిక్రమించలేము. నీమనస్సులో ఏదోషములు ఉన్నాయో ముందుచూసుకో. తరువాత వాటిలోనుండి విడుదలపొందటానికి ప్రయత్నంచెయ్యి. ఒక అబ్బాయికి వాడి అన్నగారిమీద ద్వేషంగాఉందట దానికి కారణం అన్నగారు బాగా చదువుతున్నాడట. అన్నగారు బాగా చదువుతూఉంటే అన్నగారిని ఆదర్శంగా పెట్టుకోవాలిగాని అన్నగారిని ద్వేషించకూడదు. ద్వేషిస్తే చీకటిలోకాలువస్తాయి, ఆదర్శంగా పెట్టుకొంటే అభివృద్ధిలోనికి వస్తావు. ద్వేషించటంవలన శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం చెడిపోతాయి. ప్రేమవలన ఏదైనా సాధించగలముగాని ద్వేషంవలన ఏదీసాధించలేము. ఒకవేళ మిూఅన్నగారు నిన్ను ద్వేషిస్తూఉన్నా నీవుతిరిగి ద్వేషించకు, నీవుప్రేమనేఇయ్యి అప్పుడు ఈశ్వరానుగ్రహానికి పాత్రుడవుతావు. నీ మనస్సును జాగ్రత్తగా పరిశీలనచేసుకో. ఇతరులు నిన్ను గొప్పవాడుఅంటే నేను గొప్పవాడిని అనుకోవద్దు, ఇతరులు నిన్ను తక్కువవాడుఅంటే నేను తక్కువవాడిని అనుకోవద్దు. నీమనస్సులో ఏమి ఉందో జాగ్రత్తగాచూసుకో. నీ శరీరానికి రోగంవచ్చిందిఅనుకో నీకురోగంలేదుఅని ఇతరులుఅన్నా దానివలనలాభంలేదు, నీకురోగంలేదుఅనుకో నీకు రోగంఉందిఅని

ఇతరులుఅన్నా దానివలన నష్టంలేదు. అందువలన ఇతరులగొడవవద్దు. నీ మనస్సులో ఏ బలహీనతలు ఉన్నాయో జాగ్రత్తగా పరిశీలనచేసుకొని, వాటిని తొలగించుకోవడానికి ప్రయత్నంచెయ్యి. ఈమధ్య టౌన్‌లోనికి ఒకస్వాములవారు వచ్చారు దేవుడులేడుఅని చెపుతున్నారుఅని ఒకభక్తుడు భగవాన్‌తోఅంటే చెప్పటం వాళ్ళతప్పకాదు, వెళ్ళి వినటంమీదితప్పఅన్నారు. అంటే మీకు ఆ బలహీనతఉందికాబట్టి వెళ్ళారు లేకపోతే వెళ్ళరుఅని చెప్పారు. యజ్ఞాలు, పుణ్యాలుచేసినవారు బ్రహలోకానికి వెళతారుఅని చెపుతారుకాని నిన్ను నేను ఆలోకానికి వెళ్ళమని చెప్పటంలేదు, ఏలోకానికివెళితే మరల తిరిగిరావలసిన పనిలేదో ఆలోకానికివెళ్ళు అని భగవంతుడు చెపుతున్నాడు. హృదయంలోఉన్న బంగారాన్ని వదిలేసి, రోడ్డుమీద ఉన్న పెంకుముక్కలు, గాజుముక్కలు కోసం తిరుగుతావుఎందుకు? లోకంలోఉన్న విషయాలనుండి వచ్చే చిల్లర ఆనందాలను మర్చిపోతే ముగింపులేనిఆనందం నీకు అనుభవంలోనికివస్తుంది. దేహమునేనుఅనేతలంపు వలననే విషయచింతనవస్తుంది. విషయచింతనను విడిచిపెట్టినప్పడే మనస్సుకు లోచూపుకలుగుతుంది. దేహంనేనుఅనే తలంపును ఉంచుకొని ఎన్ని త్యాగాలుచేసినా ఏమీప్రయోజనంలేదు. దేహము నేనుఅనేతలంపును విడిచిపెట్టటమే నిజమైనత్యాగం. మనం ఏమిచేస్తాముఅంటే పనికివచ్చేవి అన్నీ మనం ఉంచుకొని పనికిరానివి దేవునికి ఇస్తాము. ఈ సృష్టిలో ఎందుకు పనికిరానిది ఏదైనాఉందిఅంటే అది నీఅహంకారం. పనికివచ్చేవిఅన్నీ ఉంచుకొని పనికిరానివి దేవునికి ఇస్తున్నావు కదాపోనీఅలాగైనా నీఅహంకారాన్ని దేవుడికి ఇచ్చేయవచ్చునుకదా, అలాఇవ్వవు కారణం అదే నువ్వు అనుకొంటున్నావు. అదే అజ్ఞానం. ఇందులోనుండి విడుదల పొందటమే జ్ఞానం. కోరిక మనకు దుఃఖాన్ని తీసుకొనివస్తుంది. బంగారం దుఃఖాన్ని తీసుకొనిరాదు. బంగారంమీద మనకు ఉన్న కోరిక దుఃఖాన్ని తీసుకొనివస్తుంది. అలాగే ప్రపంచం దుఃఖాన్ని తీసుకొనిరాదు. ప్రపంచంలోఉన్న వస్తువులమీద నీకుఉన్న కోరిక దుఃఖాన్ని తీసుకొనివస్తుంది. ప్రపంచం దుఃఖాన్నితీసుకొనివస్తే రామకృష్ణుడికి, రమణుడికికూడా దుఃఖంరావాలికదా. అందుచేత ప్రపంచం దుఃఖాన్ని తీసుకొనిరావటంలేదు, ప్రపంచంలోఉన్న వస్తువులమీద మనకు ఉన్నకోరికే దుఃఖాన్ని తీసుకొనివస్తుంది. కోరికతీరితే మీకు కొంత ఆనందంవస్తుంది, కాని దీనికంటే కోటిరెట్లు ఆనందం ఏకోరికలేనివాడికి కలుగుతుంది. దేహమునేనుఅనే తలంపును త్యాగంచెయ్యి ఇంక సృష్టిలో విడిచిపెట్టవలసిందిఅంటూ ఏమిలేదు. నీవుచేసే సాధనలో దేహమునేనుఅనేతలంపును కలుపు. దానిని అందులో కలపకపోతే రోగంఒకటయితే మందులు మరొకరకంవాడుతున్నట్లు అవుతుంది, ఇంక రోగంఎలా తగ్గుతుంది. మనకు కొంతమందినిచూస్తే పెట్టాలనిపిస్తుంది, కొంతమందినిచూస్తే మొట్టాలనిపిస్తుంది. ఈ ఇష్టాలు,





అయిష్టాలే మనస్సును బాహ్యముఖం చేస్తున్నాయి. ఇవిపోతేగాని మనకు మోక్షంరాదు. ఈమధ్య మాకు శాంతిలేదుఅని చాలమంది అంటారు. ఇష్టాలు, అయిష్టాలవలన మనం శాంతికి దూరంఅవుతున్నాము. ఇదిఅర్థం అవ్వటానికి మనకు వందజన్మలు పట్టవచ్చు. వారు మంచివారుకాదుఅంటాము, కోడలు మంచిదికాదుఅని అత్తగారు, అత్తగారు మంచిదికాదుఅని కోడలు అంటుంది. వారిని ఈశ్వరుడే భరిస్తున్నాడుకదా మీకునష్టంఏమిటి. సత్పురుషులుతో సహవాసంవలన నీహృదయంలోఉన్న నిజంనీకు తెలియబడుతుంది. లౌకికులతో స్నేహంవలన బంధంవస్తుంది, సత్పురుషులతో సహవాసంవలన జ్ఞానంకలుగుతుంది. అందువలన సత్పురుషులతో, మహాత్ములతో సహవాసంమంచిది. మనలోదోషాలుఉంటే మహాత్ములను గుర్తించలేము. భగవంతునిపట్ల మనకుఉన్న ప్రేమనిజమైతే ఆయనే మనకోసం దేహంధరించివస్తాడు. భగవంతుడు కరుణామయుడు సత్పురుషులు ఏపనిచేసినా మౌనంగానేచేసేస్తారు. ఆత్మానుభవం నీకుకలిగినప్పడు మాటలతో పనిలేదు, మాట్లాడకూడదుఅని వాడుఅనుకోడు, సహజంగానే మాటలు ఆగిపోతాయి. రైలు ఇంజన్‌ను పెట్టెలు ఏవిధంగా పట్టుకొనిఉంటాయో, అలాగ గురువును, ఈశ్వరుడిని మనస్సుతో పట్టుకొని ఉండు. నిరంతరంఈశ్వరుడిని జ్ఞాపకంపెట్టుకోవటంవలన, ఆయనను అంటిపెట్టుకొని ఉండటంవలన ఇంజనువెనకాలపెట్టెలు వెళ్ళినట్లు ఈశ్వరుడునిన్ను గమ్యానికి తీసుకొనిపోతాడు. మీకు కోరికలు ఉన్నప్పడు భగవంతుని మీద ఎంతప్రేమ ఉంటుందో కోరికలులేనప్పడుకూడా భగవంతుడిమీద అంతప్రేమఉంటే ఈజన్మలోనే మీకు మోక్షంవస్తుంది. మనం జన్మరహితులం, మరణరహితులం. గాఢనిద్రే మనకుగురువు. గాఢనిద్రలో జననమరణాల గొడవ, శరీరంగొడవ ఏమీలేకుండా అక్కడసుఖంగా ఉన్నాము. ఆస్థితి ఇప్పడు జాగ్రదవస్థలోకూడాఉంది. ఆస్థితిని అనుభవంలోనికి తెచ్చుకోవటమే నిజమైనపని. ఆపనికి నీశరీరాన్ని, మనస్సును, శాస్త్రాన్ని, గురువును ఉపయోగించుకో. అదే సాధన. అది తప్పించి ఏదిసాధించినా స్వప్నసమానమే. మిమ్మల్ని ఇక్కడకు తీసుకొనివచ్చినవాడు, శ్రవణంచేయించేవాడు, అది అర్థమయ్యేటట్లుచేసేవాడు అంతా ఈశ్వరుడే. అంతాగురువే. ఆయన అనుగ్రహంలేకపోతే మీరుఇక్కడకురాలేరు. ఆయన బాషమౌనమే, అదేనిజమైన ఉపదేశం. మహాత్ములు మాటలుచెప్పనవసరంలేదు, వారిదర్శనమే సరిపోతుంది. గుడిలో దేవుడు ఉన్నాడు ఆయన ఎంతపవిత్రుడో మీజీవుడుకూడా అంత పవిత్రుడు అయితే మీదేహంకూడా దేవాలయంఅవుతుంది. మీరు పూజార్హులుఅవుతారు. మీరువద్దన్నా మీకుపూజలుచేస్తారు, మీపాదాలనుఆశ్రయిస్తారు. గుడిలో దేవుడు ఉంటాడు అలాగే ఇప్పడు మీదేహంలోఉన్నది జీవుడుకాదు దేవుడుకాబట్టి మిమ్మల్ని ఆరాధిస్తారు. యజ్ఞాలు, యాగాలు, నదులలో

ములగటాలు, పూజలు, జపాలు ఇవన్నీకూడా జ్ఞానియొక్క చూపుకుసరికావు. జ్ఞాని చూపుద్వారా జ్ఞానాగ్ని నీహృదయంలోనికి చొచ్చుకొనిపోయి, జీవలక్షణాలను కాల్చి బూడిదచేస్తుంది. జ్ఞానియొక్క వైభవంఅట్టిది. జ్ఞానిచేస్తున్నపని నీకుతెలియదు, నీకంటికి కనబడదు. అందుచేత జ్ఞాని పనిచేయటంలేదుఅని అనుకోవద్దు. జ్ఞానిసమక్షంలో నీకు పునర్జన్మను తీసుకొనివచ్చే సంస్కారములు ఉన్నప్పటికి అవి అణిగిపోయి నీకు సమాధిస్థితి కలుగుతుంది. నాకు సమాధిస్థితి నేర్పమని రంగన్ భగవాన్‌ను అడుగుతాడు. నీకు సమాధిస్థితి ఎందుకురా సహజసమాధిస్థితినే నేర్పుతా అన్నారు భగవాన్. మనకు ఏదిమంచిదో మనకంటే ఎక్కువ భగవంతుడికి తెలుసు. ఒకసారి మనకు కష్టాలుపండుతాడు. మనం అంటే ఇష్టంలేక కష్టాలు పంపటంకాదు, ఆకష్టాలద్వారా మిమ్మల్ని పవిత్రులుగాచేస్తాడు. గురువు ఏమిచేస్తాడుఅంటే హృదయంలోఉన్న ఆనందంయొక్క రుచిచూపిస్తాడు. ఆరుచిని పట్టుకొని ఆస్థితిని మనం పెర్మనెంట్‌చేసుకోవాలి. మనలోఉన్నవాసనలు ఆరుచిని చెడగొడతాయి. వాసనలను తొలగించుకోవటానికి ఈశ్వరునిపాదాలను ఆశ్రయించాలి. వాసనాక్షయంఅయితే ఆస్థితి పెర్మనెంట్అవుతుంది.

గుడికివెళ్ళండి, మంచిగ్రంథాలు అధ్యయనంచేయండి, సత్పురుషులతో సహవాసంచేయండిఅనిచెపితే కొంతమంది ఏమిచెపుతారుఅంటే మేము చాలా బిజీగాఉన్నాము, గాలిపీల్చుకోవటానికికూడా మాకు టైములేదుఅంటారు. బాబాఏమిచెపుతున్నారుఅంటే మీరు చేసేపనులు మీరు పవిత్రులు అవ్వటానికి సహకరిస్తూఉంటే మీరుగుడికివెళ్ళకపోయినా ఫరవాలేదు. మరి మీరు చేసేపనులు మిమ్మల్ని పవిత్రుడిని చేస్తున్నాయో లేదో చూసుకోండి. మీరు చేసే పనులవలన పవిత్రత రాకపోతే అటువంటి పనులుచేస్తూ మేము బిజీగాఉన్నాముఅంటే దానివలన ప్రయోజనంఏముంటుంది. ఏదోరోజు చావువస్తుంది, మేము ఖాళీగాలేము బిజీగాఉన్నాముఅంటే చావుఆగుతుందా? ఆగదు. మాకు ఖాళీలేదుఅని చెప్పేవాడు దురాశాపరుడు అన్నారు బాబాగారు. అందువలన వివేకంగా జీవించండి.



3A

# రమణభాస్కర

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, ది. 31-01-02, నర్సాపురం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడుఅంతటా ఉన్నాడు, అందరిలోఅంతర్యామిగా ఉన్నాడు. ఆయనపనిచేస్తున్నాడు. ఆయనచేసేపని మనకళ్ళకు కనబడటంలేదుకాబట్టి భగవంతుడులేడు అనుకొంటున్నాము. ఆయనచేసేపని ఏమిటిఅంటే మనలను ఎప్పడు, ఎక్కడ ఎలా ఉంచాలా నియమిస్తూ ఉంటాడు. భగవంతుడుకూడా తింటాడు, ఆయన మన అహంభావనను తింటాడు. ఆయన మన అహంభావనను తింటేగాని ఆయన స్వరూపం మనకు దొరకదు, అది ఆయనకు తెలుసు. మనం శ్రద్ధగా పనిచేయాలన్నా, శ్రద్ధగా ధ్యానంచేయాలన్నా 1. ఈశ్వరుడు ఉన్నాడుఅనే సజీవమైన విశ్వాసం, 2. ఈశ్వరుడిమీద ప్రేమ, భక్తి ఇవిరెండూముఖ్యం. మీకు ఎంతధనంఉన్నా, విద్యఉన్నా, అధికారంఉన్నా, సమాజంలో మీమాట చెల్లుబాటు అవుతూఉన్నా ఈశ్వరునిమీద ప్రేమలేకుండా, ఆయనమీద విశ్వాసంలేకుండా మనం ఆయననుపొందలేము. అందరికీ ఏదోరోజు మరణంవస్తుంది, అందులో సందేహంలేదు. మనం స్వార్థం తగ్గించుకొంటూ, ఎంతవరకు తగ్గించుకోగలమో అంతవరకు రాగద్వేషములను తగ్గించుకొంటూ తెలివిగా, వివేకంతో జీవిస్తూఉంటే మరణంవచ్చేరోజు వచ్చేసరికి మరణభయంపోతుంది, అభయస్థితినిపొందుతాము. మనం దేహమే సత్యంఅనుకొంటున్నాము, దేహమేసర్వస్వంఅనుకొంటున్నాము అందువలన భగవంతుని ఉనికిపట్ల మనకు విశ్వాసంకుదరటంలేదు. మనహృదయంలో ఒకమహావెలుగు ఉంది, ఒకశక్తిఉంది. దానికి జననంలేదు, మరణంలేదు. అది మనమై ఉన్నాము. అయినప్పటికి ఈదేహమే మనంఅనుకోవటంవలన మనకు దుఃఖంవస్తోంది. మన సాధనయొక్క ప్రయోజనం ఏమిటిఅంటే దేహాభిమానం తగ్గించుకొంటూరావాలి. ఆరోజుకారోజు దేహాభిమానం తగ్గించుకొంటూవస్తే ఏదోరోజు మనకు శివబుద్ధి కలుగుతుంది.

భగవంతుడు మనలోపలే ఉన్నాడు. మనకు శాంతినిఇవ్వటానికి, నిర్వాణస్థితిని ప్రసాదించటానికి సిద్ధంగాఉన్నాడు. మీరు తొందరపడకండి. మిమ్మల్ని ప్రిపేర్‌చేస్తున్నాడు. మనం భౌతికంగావచ్చే చిన్నచిన్న సంతోషాలను తట్టుకోలేము. కోటిరూపాయలు లాటరీవచ్చిందిఅంటే గుండె ఆగిచనిపోతాము. భౌతికవిషయాలను, చిన్నచిన్న సంతోషాలను తట్టుకోలేకపోతున్నాము. భగవదనుభవం పొందటానికి ప్రిపరేషన్‌కావాలి, దానికే పూజ, జపం, ధ్యానం, విచారణ ఇవిఅన్నీ. ఏదో మహిమలవలన, చమత్కారములవలన భగవంతుడుతెలియబడడు. తల్లికడుపులోనుండి మనం బయటకువచ్చినప్పడు జానెడు ఉన్నాము. అన్నంతినటంవలన ఐదుఅడుగులు, ఆరుఅడుగులు ఎదిగిపోయాము. దానివలన

నీకుమోక్షంరాదు. ఎదుగుదలఅనేది, వికాశంఅనేది లోపలనుండి రావాలి. మార్పుఅనేది బయటకాదు, లోపలమార్పురావాలి, మీస్వభావంలోమార్పురావాలి. అందుచేత మీసాధన అంతా లోపలగురిపెట్టాలి. ఒకప్రక్క ఆత్మజ్ఞానం గురించి శ్రవణంచేస్తూ, మననంచేస్తూ, దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నంచేస్తూ, రెండవప్రక్క సమాజపరంగా గొప్పలతో సంబంధంలేకుండా ఈశ్వరానుగ్రహంపొందటానికి మంచిపనులుచేస్తూ వెళ్ళాలి. చేతితో మంచిపనులు చేయాలి, నోటితో ఈశ్వరానుగ్రహంపొందటానికి సహకరించేమాటలు మాట్లాడాలి. నీకు తెలిసింది మినహాయింపులులేకుండా ప్రేమతో ఇతరులకు చెప్పి వారిని నీఅంతటివారిగాచేయాలి. నీవుఏపనిచేసినా ఫలంపట్ల ఆసక్తిలేకుండా చేస్తే నీచేతిలోఉన్న పనిపూర్తిఅవుతుంది, నీవు యోగివిఅవుతావు. ఈశ్వరుడు అందరిహృదయాలలో అంతర్యామిగాఉన్నాడు. ఆయనను విశ్వసించినవారికి, నమ్మినవారికి సొమ్ము, నమ్మకపోతే దుమ్ముమిగులుతుంది. మనమనస్సులో వికారములు ఉన్నాయి, మనఇంద్రియాలలో వికారములు ఉన్నాయి. కాని వికారములులేనిది, ఆకారంలేనిది, చావులేనిది, పుట్టుకలేనిది సదా ఒకటిఉంది. దానినే మన పెద్దలు బ్రహ్మంఅంటున్నారు. బ్రహ్మంలోనే సృష్టి, స్థితి, లయలు జరుగుతున్నాయి. మనం బ్రహ్మమైఉన్నాము. కాని అది మనకు తెలియటంలేదు. బ్రహ్మంను అనుభవైకవేద్యం చేసుకో. అప్పడు నీకు ఎటుచూసినా ఆనందమే. అప్పడు దేహంఉన్నా, లేకపోయినా నీకు ఏమీఅనిపించదు.

మీరు ఎక్కడఉన్నప్పటికి, ఏదేవునిఉపాసనచేస్తున్నప్పటికి మీరు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలంటే లోచూపునేర్చుకోవాలి, దానిని ప్రాక్టీసుచేయాలి. లోచూపును ప్రాక్టీసుచేయాలంటే సత్వగుణంఅవసరం. మనం ఈభూమిమీదకు ట్రైనింగ్ అవ్వటానికివచ్చాము. కొంతమంది మనలను పొగుడుతారు, కొంతమందివిమర్శిస్తారు. అప్పడు మన బ్రెయిన్ సమానంగాఉందో, లేదోచూసుకోవాలి. విమర్శలకు కృంగిపోయి, పొగడ్తలకుపొంగిపోతే దేహమునేనుఅనేతలంపుకు Food Supply అవుతుంది. మనలో సత్వగుణం అభివృద్ధి అవ్వటానికి, మనకు లోచూపునేర్పటానికి ఈశ్వరుడు అనేక సంఘటనలు క్రియేట్‌చేస్తాడు. మనకు అనుకూలపరిస్థితులు వచ్చినప్పడు ఎలాఉంటున్నామో, ప్రతికూలపరిస్థితులువచ్చినప్పడు ఎలా ఉంటున్నామో లోపలఉండి ఈశ్వరుడు చూస్తూఉంటాడు, ఆయన సర్వసాక్షి. మనకు ఏదైనా కష్టంవచ్చినప్పడు దానితోతాదాత్మ్యంచెంది దుఃఖపడటంవలన భగవంతుడిని మిస్‌అవుతాము, దానిని ఇముడ్చుకొంటే కష్టంలోకూడా ఆనందాన్ని, శాంతిని పొందవచ్చు. వారుఆచరించలేదు, వీరుఆచరించలేదు అనేగొడవవద్దు. మనం ఎంతవరకు ఆచరించగలమో అంతవరకు ఆచరిస్తే మనకు భగవదనుభవం కలుగుతుంది. మనలను మనకళ్ళతోచూసుకోవాలి. ఇతరులకళ్ళతో మనలను చూసుకోకూడదు. ఇతరులలో దోషాలనుకాదు మనం చూడవలసింది, మనలోఉన్న దోషాలను చూసుకొని వాటిలోనుండి విడుదలపొందటానికి ప్రయత్నంచేయాలి, అదేసాధన. సాధకుడు సహనాన్ని ఎక్కువగా ప్రాక్టీసుచెయ్యాలి. ప్రతీచిన్న సంఘటనకు ఊగిసలాడకూడదు, స్టెడీగా ఉండాలి, ఈదేహము, ఇంద్రియాలు, కష్టసుఖాలు, లోకం ఇవిఅన్నీ తలంపులే. వీటిని మూలతలంపే కల్పించింది. మూలతలంపు ఎంతనిజమో, మూలతలంపు కల్పించిన విషయాలుకూడా అంతేనిజం. మూలతలంపును దానిమూలంలోనికి పంపటమే నిజమైన అన్వేషణ. దేహం ఇక్కడఉండగానే మూలతలంపు మూలాన్ని అన్వేషించి, దానిని చూడగలిగితే భగవంతుడే నీకు తానుగావ్యక్తమవుతాడు. మనం ఎంతవరకు తగ్గించుకోగలిగితే అంతవరకు వేగ్జిమమ్ స్వార్థం తగ్గించుకొంటే ఈశ్వరుడికి దగ్గరవుతాము, ఆయన వలయంలోప్రవేశిస్తాము, ఈశ్వరుడినిపొందుతాము. సత్యంఅంతటా ఉంది, అది మనహృదయంలోకూడాఉంది. సత్యాన్ని మహాత్ములు రిప్రజెంట్‌చేస్తున్నారు. అయితే మతాలపేరుమీద కలహాలకు కారణం రూపబుద్ధి, నామబుద్ధి. మనకు రూపబుద్ధి, నామబుద్ధి ఉందికాబట్టి అల్లాను, ఏసును, కృష్ణుడిని ఆరూపానికి, నామానికి పరిమితంచేస్తున్నాము. రూపబుద్ధి, నామబుద్ధి వలన కలహాలు వస్తున్నాయి. రూపబుద్ధిని, నామబుద్ధిని తీసి ఒకప్రక్కనపెట్టు, ఏమీలేదు. నీకు పొట్టఉందికాబట్టి దానికోసం సంపాదించు, ఇతరులమీద ఆధారపడవద్దు, నీకు అధనంగా ధనంఉంటే ఇతరుల అవసరాలకు ఉపయోగించు. ఇతరులకు ఇచ్చింది నీకే తిరిగివస్తుందని తెలిస్తే ఇవ్వకుండా ఎలా ఉండగలవుఅన్నారు భగవాన్? ఇతరులు నీకు ఏపనిచేస్తే నీకు అశాంతికలుగుతుందో, బాధకలుగుతుందో ఆపనులు ఇతరులపట్ల నీవుచేయవద్దు. ఇతరులు ఎలా మాట్లాడితే నీకు బాధకలుగుతుందో ఇతరులపట్ల నీవు అలామాట్లాడవద్దు. నీవు ధనంసంపాదించవచ్చుకాని అదే నిజంఅనుకోవద్దు. నీధ్యాస, నీధ్యేయం ఎప్పడూ ఈశ్వరుడిమీద ఉండాలి. ఏహృదయంలో ఈశ్వరుడు నివాసంగాఉన్నాడో దానిని పొందటంమీదే నీధ్యేయంపెట్టుకో. కాళ్ళునడవవచ్చు, చేతులుపనిచేయవచ్చు. నీకు ధనంఉండవచ్చు, విద్యఉండవచ్చు వాటితో మంచిపనులుచేస్తూ ఉండవచ్చు కాని నీవు గమ్యాన్నిమర్చిపోవద్దు, భగవదనుభవం పొందటంమీదే నీధ్యాస ఉండాలి, దానిని మిస్‌అవ్వవద్దు. ఒకసారి గాంధీగారు పదిమంది మధ్యలోకూర్చొనిఉండగా ఆయన కళ్ళనుండి నీరువస్తున్నాయి. దానికి కారణంఏమిటిఅని అడిగితే అవి బాహ్యసంఘటనలవలన రావటంలేదు. నేను బుద్ధుడుకంటే గొప్పవాడినిఅని రాత్రికలవచ్చింది. అంటే నాకు తెలియకుండా నాలో అహంభావన ఉంది. మీరుఅందరూ నన్ను మహాత్ముడుఅంటున్నారు కాని నాలో బలహీనతలు ఉన్నాయి. అవి జాగ్రదవస్థలో తెలియలేదు. స్వప్నంలో తెలిసింది. అందుకే కళ్ళనీళ్ళు వచ్చాయి. నా శేషజీవితంలో ఆ బలహీనతలను తొలగించుకోవటానికి ప్రయత్నంచేయాలిఅని గాంధీగారు చెప్పారు.

దేహము నేను అనేతలంపు నీకు బయటనుండి రావటంలేదు, అది బయటనుండి

వస్తూఉంటే ఇక్కడనుండి వస్తోంది అని నీకు ఎవరైనా చూపించవచ్చు. కాని అది లోపలనుండి వస్తోంది. కాబట్టి నీవే దానిని తెలుసుకోవాలి. దానికి శాస్త్ర సహాయం, సత్పురుషుల సహాయం తీసుకోవాలి. దేహగతమైన నేను కలుషితమైన నేను. భగవంతుడిని స్మరించగా, స్మరించగా ఈ కలుషితమైన నేనును తినేస్తాడు. ఒకసారి రాజుగారు సింహాసనం మీదకూర్చొని ప్రక్కన కూర్చొన్న ఒక భక్తుడితో దేవుడు ఏమైనా తింటాడాఅని అడిగాడు. ఆ తింటాడు మీరు నేను నేను అంటున్నారు కదా ఆ నేనును తింటాడు అని చెప్పాడు. ఎప్పడైనా నవ్వుతాడా అని అడిగాడు. నవ్వుతాడు అన్నదమ్ములు ఆస్తులు పంచుకొనేటప్పడు పడేగొడవలు చూసి నవ్వుతాడు. అంతవరకు నా అన్న, నా తమ్ముడు అంటారు. అంతవరకు ఈ స్థలం మనది మనది అంటారు. పంచుకొనేటప్పడు ఆ స్థలం కోసమే పేచీ పెట్టుకొని కోర్టులచుట్టూ తిరుగుతారు. ఆస్తుల పంపకంలో చిన్న విషయం దగ్గర గొడవలు పడతారు. అది చూసి భగవంతుడు నవ్వుతాడు. భగవంతుడు ఇంకా ఏమైనా చేస్తాడా అన్నాడు రాజు. అప్పడు ఆ భక్తుడు ఏమి చెప్పాడు అంటే మీరు సింహాసనం దిగివచ్చి నా ప్రక్కన కూర్చోండి అన్నాడు. రాజుగారు వచ్చి క్రింద కూర్చొన్నారు, ఆ భక్తుడు వెళ్ళి సింహాసనం మీద కూర్చొని ఒక మనిషిని క్రింద పెట్టగలడు, ఒక మనిషిని సింహాసనం మీద కూర్చోపెట్టగలడు ఇటువంటి పనులు కూడా దేవుడు చేయగలడు. దేవునికి అసాధ్యం అంటూ ఏమీ లేదు, ఆయనకు అన్నీ సాధ్యమే. దేవుడు అంటే జడవస్తువుకాదు, జీవకోటిని నియమిస్తూ ఉంటాడు. ఇప్పడు మనకు అనుభవంలో ఉన్న నేను తింగర నేను. అది దాహముతో, ఇంద్రియాలతో, లోకంతో కలిసిపోయి కలుషితమైపోయింది. ఆ నేను నుండి విడుదల పొందటానికి ఆ నేనులేనివారితో సహవాసం చెయ్యాలి. ఈ అసత్యమైన నేనునుండి విడుదల పొందకపోతే సత్యానుభవం నీకు కలుగదు. నీ హృదయంలో ఉన్న సత్యం తప్పించి నీవు ఏది సాధించినా అది కాలప్రవాహంలో కొట్టుకొనిపోతుంది. దేహం కూడా కాలప్రవాహంలో కొట్టుకొని పోతుంది, పెద్దపెద్ద సామ్రాజ్యములే కాలప్రవాహంలో కొట్టుకొని పోయాయి. నీ బుద్ధితో చెప్పినది, రాగద్వేషములతో చెప్పినది తాత్కాలికంగా నీకు నిజంగా అనిపించినప్పటికీ కాలప్రవాహములో ఇవి అన్నీ కొట్టుకొనిపోతాయి. ఉన్నది ఒక్కటే. అదే ఆత్మ, అదే బ్రహ్మం. నీ బుద్ధితో, రాగద్వేషములతో చెప్పినమాటలు నిలబడవు, అది కలుషితమైన నేను. నీ మాట కలకాలం, చిరకాలం నిలబడాలంటే నీవు బ్రహ్మమై చెప్ప, నీవు ఆత్మవై చెప్ప. నీవు నిజంలో ఉండి చెప్ప అప్పడు ఆ మాట నిలబడుతుంది.

భగవాన్ చెప్పేది ఏమిటి అంటే నేను అనే తలంపును అలంకరించవద్దు. నేను అనే తలంపును మినహాయించి సాధనలు చేయవద్దు. మీ సాధనలో నేను అనే తలంపును ఇన్‌వాల్వ్ చేయండి అప్పడు అది నశిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే దేహము నేను అనే తలంపుకు మీరు దగ్గరగా ఉండకండి, దూరంగా ఉండండి. ఎక్కడైనా పెంట ఉంటే మీరు దానికి దూరంగా ఉండాలి అంతేగాని పెంట మీద కూర్చొని చెడ్డవాసన వస్తోంది అంటే అది పెంట తప్పకాదు, అది మీదే తప్ప. అలాగే మీరు దేహము నేను అనే తలంపు చుట్టూ తిరుగుతూ పునర్జన్మకు గురి అవుతున్నారు, దుఃఖాన్ని మోస్తున్నారు. దేహాన్ని గాయపర్చినా ఊరుకొంటున్నారు గాని దేహగతమైన నేనును గాయపరిస్తే ఊరుకోవటంలేదు. అది అంటే మనకు అంత ఇష్టం ఎందుచేతనంటే అదే మనం అనుకొంటున్నాము. దేహము నేను అనే తలంపుకు, ఆ మూలతలంపుకు ఎంతదూరంగా జీవిస్తే అంత మంచిది, దానిని అలంకరించవద్దు, దాని వాడకం తగ్గించుకోండి. అలా జీవించటం వలన అది నెమ్మదిగా ఉపసంహరింపబడి దాని మూలంలోనికి వెళ్ళి అది నశిస్తుంది. అప్పడు నిజమైన నేను నీకు వ్యక్తమవుతుంది. అదే నీ జీవిత గమ్యం.

దేహం యొక్క కంఫర్టుకంటే మనస్సు కంట్రోలులో ఉన్నప్పడు నీకు ఎక్కువ ఆనందం వస్తుంది. అందుచేత నీ మనస్సు సహాయంతో మనస్సును అదుపులో పెట్టుకొన్నప్పడు ఆ నిగ్రహం యొక్క అంచులలోనే నీవు పొందవలసిన వస్తువు ఉంది, దాని అనుగ్రహం సహాయం వలన దానిని పొందుతావు. దాని అనుగ్రహానికి అనుకూలంగా నీ జీవిత విధానాన్ని తీర్చి దిద్దుకోవాలి. అదే ధర్మం. మనం ధర్మాన్ని అంటిపెట్టుకొని ఉంటే ధర్మం మనలను ఎక్కడికి తీసుకొని వెళ్ళాలో అక్కడికి తీసుకొని పోతుంది. ఇతరుల గొడవ వద్దు. మనం మాత్రం ధర్మం పాదాలను ఆశ్రయించి జీవించాలి. కుండలో అన్నం ఉంది అనుకోండి. దానిపైన మూకిడి ఉంది అనుకోండి. లోపల ఉన్న అన్నం కనబడకుండా ఆ మూకిడి చేయగలదు. హృదయంలో ఆనందం ఉంది, శాంతి ఉంది. అది మీకు అందకుండా చేసేది దేహగతమైన నేనే. మూకిడి తీసి ప్రక్కన పెడితే కుండలో అన్నం ఎలా కనబడుతుందో అలాగే దేహగతమైన నేనును తీసి ఒక ప్రక్కన పెడితే హృదయంలో ఉన్న ఆనందం ఉబికి ఉబికి నీ సహస్రారాన్ని ముంచేస్తుంది. జ్ఞాని స్థితి ఎలాగ ఉంటుంది అంటే ఒకవేళ చంద్రమండలం నుండి వేడి వచ్చినా, సూర్యమండలం చల్లబడిపోయినా, అగ్ని జ్వాల సహజంగాపైకి వెళుతుంది దానికి విరుద్ధంగా అగ్ని జ్వాల క్రిందికి వెళ్ళినా ఎవడైతే బ్రహ్మానుభవం పొందాడో వాడికి ఏమీ ఆశ్చర్యం కలుగదు, వాడు నిర్మలంగానే ఉంటాడు. అది జ్ఞాని స్థితి, అది సహజస్థితి. జ్ఞానం పొందటానికి ఎవరికి వారు కృషి చేసుకోవలసిందే. ఎవరో వచ్చి జ్ఞానం ఇస్తారు అని కనిపెట్టుకొని ఉండవద్దు. ఏ వస్తువు అయితే మన హృదయంలో అంతర్యామిగా ఉందో దాని అనుగ్రహం లేకుండా దానిని మనం పొందలేము. దాని అనుగ్రహం పొందటానికే మన సాధనను గురిపెట్టాలి మీరు పూజచేసినా, జపం చేసినా, ధ్యానం చేసినా. మీరు చిల్లర గొడవలలోనికి వెళ్ళవద్దు. అక్కడ పసుపు వచ్చింది, ఇక్కడ కుంకుమ వచ్చింది. వారికి మోకాలు నెప్పి తగ్గింది ఇటువంటి చిల్లర గొడవలలోనికి వెళ్ళవద్దు. చిల్లర గొడవలలోనికి వెళితే అసలు గమ్యాన్ని మిస్ అయిపోతాము. అందువలన బహుజాగ్రత్తగా ఉండాలి.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు

| | | |
|---|---|---|
| 23-02-02 | శనివారం | చించినాడ, గీతామందిరం |
| 24-02-02 | ఆదివారం | జిన్నూరు, నూతన శ్రీ సీతారామ ధ్యాన మందిరం |
| 28-02-02 | గురువారం | విస్సాకోడేరు మార్రాజుగారి యింటివద్ద |
| 02-03-02 టు 09-03-02 | | హైదరాబాదు కేంపు |
| 03-03-02 | ఆదివారం | హైదరాబాదు, చిక్కడపల్లి త్యాగరాయ గాన సభ |
| 06-03-02 | బుధవారం | హైదరాబాదు, కూకట్‌పల్లి శాతవాహన నగర కాలనీ |
| 12-03-02 | మంగళవారం | చించినాడ, శివరాత్రి |

## జిన్నూరులో శ్రీ సీతారామ ధ్యాన మందిర్ విగ్రహ ప్రతిష్ఠాపన



ది॥ 24-02-2002 తేదీ ఆదివారం ఉదయం గం॥ 7-49 ని॥లకు పునర్వసు నక్షత్ర యుక్త మీన లగ్నమందు జిన్నూరు గ్రామములో నూతనముగా నిర్మించిన శ్రీ సీతారామ ధ్యాన మందిరం నందు గణపతి అష్టలక్ష్మీదేవేరుల సీతారామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ, సద్గురు శ్రీ నాన్నగారిచే ప్రథమ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమములు శ్రీ యజ్ఞపురాధీశ్వరీ పీఠాధిపతి గురుశ్రీ శ్రీధర్‌స్వామీజీ ఆధ్వర్యంలో జరుపబడును. మధ్యాహ్నం గం॥ 2-07 ని॥లకు సద్గురు శ్రీనాన్నగారి ఉపన్యాసము కలదు. కావున భక్తులు ఏవన్మంది కార్యక్రమములందు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరుచున్నాము.

## శ్రీ రమణ క్షేత్రం ప్రచురణలు

| నెం. | పుస్తకం పేరు | వెల |
|---|---|---|
| 1. | వినీలాకాశంలో వింతకాంతి | 25/- |
| 2. | అమృత వాక్కులు | 20/- |
| 3. | The Call of the Holy Hill | 20/- |
| 4. | మధుర వాక్యములు | 12/- |
| 5. | శ్రీ రమణ ప్రస్థానత్రయం | 12/- |
| 6. | శ్రీ రమణ మహిమలు | 5/- |
| 7. | దైవ సంపద | 12/- |
| 8. | జ్ఞాన కిరణాలు | 6/- |
| 9. | సద్గురు శ్రీ నాన్నగారు | 3/- |
| 10. | శ్రీ రమణ ప్రసాదం | 5/- |
| 11. | అక్షరమణమాల | 4/- |
| 12. | శ్రీ నాన్న ప్రవచనాలు | 20/- |
| 13. | వాశిష్ట రమణీయం | 5/- |
| 14. | సత్యాన్వేషణ-సత్యదర్శనం | 10/- |
| 15. | శ్రీ రమణ అనుగ్రహతరంగాలు | 80/- |

## శ్రీ రమణ క్షేత్రంలో లభించు శ్రీరమణాశ్రమ ప్రచురణలు

| నెం. | పుస్తకం పేరు | వెల |
|---|---|---|
| 1. | శ్రీ రమణ భాషణములు | 80/- |
| 2. | శ్రీ రమణ లేఖలు | 80/- |
| 3. | శ్రీ రమణ దివ్య జీవితమకరందం | 50/- |
| 4. | నీ సహజ స్థితిలో ఉండు | 50/- |
| 5. | శ్రీ మహర్షి | 20/- |
| 6. | నేను ఎవడను? | 3/- |
| 7. | శ్రీ రమణ మహర్షి బోధలు | 20/- |
| 8. | శ్రీ రమణ కధాసుధ | 15/- |
| 9. | శ్రీ రమణ వైభవం | 45/- |
| 10. | శ్రీ రమణ గ్రంధమాల | 75/- |
| 11. | ఋభుగీత సారం | 15/- |
| 12. | శ్రీ రమణ స్మరణామృతం | 70/- |

నోట్ : పోష్టల్‌ద్వారా కావలసినవారు పోష్టల్ ఖర్చులుకూడా పంపించవలెను.

## రమణ భాస్కర పాఠకులకు మనవి

సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనాలను ది. 23-9-2001 (సద్గురు శ్రీ నాన్నగారి జన్మదినోత్సవం) నుండి సంవత్సర చందా రూ॥ 150/- లుగా నిర్ణయించడమైనది. మీరు చెల్లించిన సంవత్సర చందాకు ది. 23-9-2002 వరకు క్రమం తప్పకుండా ముద్రించిన పత్రికలు అందుతాయి. గమనించగలరు. మీరు యం.ఓ / డి.డి. / నగదు రూపంగా పంపించవలసిన చిరునామా :

**శ్రీ పి. శ్రీరామరాజు** ("రమణ భాస్కర" కొరకు)
శ్రీ రమణ క్షేత్రం, **జిన్నూరు - 534 265,** ప॥గో॥ జిల్లా, ఆంధ్రప్రదేశ్